క్లుప్తంగా

ఘనంగా అంబేడ్కర్ రమాబాయి వర్ధంతి



రమాబాయికి నివాళులర్పిస్తున్న దళిత మహిళా సంఘం

ఒంగోలు వన్‌టౌన్: కొడుకు ఆరోగ్యం కోసం ఉంచిన నగదును కుడా భర్త అంబేడ్కర్ చదువు కోసం పంపించిన మహోన్నత వ్యక్తి రమాబాయి అని దళిత మహిళా సంఘ కన్వీనర్ డీ అన్నమ్మ పేర్కొన్నారు. మంగళవారం అంబేడ్కర్ రమాబాయి వర్ధంతి కార్యక్రమాన్ని దళిత మహిళా సంఘం ఆధ్వర్యంలో ఒంగోలు మంగమూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమ్మ మాట్లాడుతూ రమాబాయి విద్యకు అన్ని రకాలుగా అండగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీ రవికుమారి, డి మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరం


సిబ్బందికి సూచనలిస్తున్న డీపీవో వెంకటనాయుడు

చీమకుర్తి రూరల్: పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీపీవో వెంకటనాయుడు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఆర్ఎల్ పురంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ఎల్‌పురం పంచాయతీని ఆయన సందర్శించారు. ప్రీమియం ఎల్‌టీసీగా ఎంపికైనందున పరిసరాల శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి వర్మీ కంపోస్టు తయారుచేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో పి.అజిత, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

యడవల్లిలో 29 నుంచి ధ్వజ ప్రతిష్ఠ ఉత్సవం

రాచర్ల: మండలంలోని యడవల్లి గ్రామంలో లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవం ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం మధ్యాహ్నం ధ్వజ ప్రతిష్ఠ, సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోలాట ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జూన్ 1న తిరుమలనాథస్వామి మూడో వార్షికోత్సవం

మార్కాపురం టౌన్: పెద్దదోర్నాల మండలం యడవల్లి గ్రామ సమీపంలో ఉన్న తిరుమల దేవుని కొండపై వెలసిన బాల తిరుమలనాథ స్వామి ఆలయ తృతీయ ప్రతిష్ఠ వార్షికోత్సవాలు జూన్ ఒకటో తేదీన నిర్వహించనున్నట్లు మందిర ప్రధాన కార్యదర్శి గోపాలుని హరిహరరావు, కమిటీ మెంబర్ వెలుదండ శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒకటో తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీదేవి భూదేవి వెంకటేశ్వర స్వామి కల్యాణం, అనంతరం అన్నదానం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రేషన్ సరుకులు డీలర్ల వద్దే పంపిణీ

అర్ధవీడు: రేషన్ కార్డుదారులకు జూన్ ఒకటో తేదీ నుంచి నిత్యావసర సరుకులు రేషను డీలర్ల ద్వారా పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ చిలకల నాగార్జునరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎండీయూ వాహనాలను ప్రభుత్వం నిలిపివేసిందని పేర్కొన్నారు. రేషన్ దుకాణాల పరిధిలో 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో రేషను డీలర్ ద్వారా సరుకులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రేషన్ దుకాణాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు సరుకులు పంపిణీ చేస్తారని స్పష్టం చేశారు.

పవనసుతునికి ప్రత్యేక పూజలు

మార్కాపురం: మార్కాపురం మండలం బొడిచర్ల గ్రామంలో హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా 6వ రోజు మంగళవారం స్వామివారికి సుప్రభాతం, ఆకుపూజ, హనుమాన్ చాలీసా పారాయణం, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో సీతారామ కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళ హారతి, పూర్ణాహుతి అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డితోపాటు పలువురు గ్రామ కమిటీ ప్రతినిధులైన ఆడిటర్ గొలమారు నారాయణరెడ్డి, రంగారెడ్డి, నూనె శ్రీనివాసరెడ్డి, హనుమంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బియ్యం బండి.. ఇక రాదండీ !

- ఇంటింటికీ రేషన్ విధానం రద్దు
- ఉపాధి కోల్పోయిన ఎండీయూ ఆపరేటర్లు
- జూన్ 1 నుంచి చౌకడిపో వద్దే రేషన్ పంపిణీ
- మండలంలో వివిధ రకాల 23316 రైస్ కార్డులు, 51 ప్రభుత్వ షాపులు


చీమకుర్తి మున్సిపల్ పరిధిలో ఎండీయూ వాహనం ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

చీమకుర్తి రూరల్:

ప్రజా పంపిణీ వ్యవస్థలో ఇంటింటికీ రేషన్ తీసుకువచ్చి దేశంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఒక విప్లవం తీసుకొచ్చింది. మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి వినూత్న ఆలోచనతో దేశం మొత్తం రాష్ట్రం వైపే చూసింది. హాయిగా ఇంటివద్దే రేషన్ తీసుకుని కుటుంబంతో ఆనందంగా గడిపారు. అక్రమాలు అరికట్టేందుకు గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఇంటి వద్దకే రేషన్ పంపిణీ విధానానికి కూటమి సర్కారు మంగళం పాడింది. ఇంటింటికీ రేషన్ అందించే ఎండీయూ వాహనాల నిర్వహణ ఖర్చుతో కూడుకున్నదని సాకు చూపి రద్దు చేసింది. చీమకుర్తి మండలంలో 51 ప్రభుత్వ చౌక ధరల దుకాణాల పరిధిలో వివిధ కేటగిరీలలో 23316 రైస్ కార్డులు ఉన్నాయి. వీటి ద్వారా లబ్ధిదారులు లబ్ధి పొందేవారు. 2021 నుంచి 14 ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ అందించారు. దూరభారంతో పాటు వ్యయప్రయాసలు తగ్గడంతో కార్డుదారులు సంతోషించారు.

రోడ్డున పడిన ఎండీయూ ఆపరేటర్లు..

ప్రస్తుత కూటమి సర్కారు నిర్ణయంతో ఇంటి వద్దనే రేషన్ పొందే అవకాశాన్ని కార్డుదారులు కోల్పోయారు. ఇక నుంచి స్టోర్ వద్దకే కార్డుదారులు వెళ్లి సరుకులు తెచ్చుకోవాలి. గత ప్రభుత్వంపై అక్కసుతో ఇంటివద్దకే వచ్చే రేషన్ సరుకులను కూటమి సర్కారు నిలిపివేయడంపై మండిపడుతున్నారు. రోడ్డున పడ్డ ఎండీయూ ఆపరేటర్లు మండల వ్యాప్తంగా ఇంటివద్దకే రేషన్ సరుకులు తీసుకొచ్చే ఎండీయూ వాహనాలు 14 ఉన్నాయి. ప్రతి వాహనానికీ ఒక ఆపరేటర్, ఒక హెల్పర్ ఉన్నారు. ఈ లెక్క ప్రకారం 14 మంది ఆపరేటర్లు, 14 మంది హెల్పర్లు ఉపాధి పొందుతున్నారు. వాహనం నిర్వహణకు ప్రతి నెలా ప్రభుత్వం రూ.21 వేలు చెల్లించేది. ఇందులో రూ.3 వేల వాహనం కంతు, రూ.3 వేలు పెట్రోల్, రూ.5 వేలు హెల్పర్‌కు ఇస్తారు. మిగి లిన రూ.10 వేలు ఆపరేటర్ వేతనంగా తీసుకునేవారు. ఈ క్రమంలో ఎండీయూ వాహనా లను రద్దు చేయడంతో ఆపరేటర్లు, హెల్పర్లు రోడ్డున పడే పరిస్థితి దాపురించింది. ఇంటింటికీ ఉద్యోగం కల్పిస్తామన్న కూటమి నాయకులు హామీని అమలు చేయకుండా తమ ఉద్యోగాలు ఊడగొట్టి రోడ్డున పడేసిందని ఆపరేటర్లు, హెల్పర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజావ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలి..


రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలి. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటింటికీ రేషన్ పంపిణీని రద్దు చేయడం దుర్మార్గం. ప్రజలు ఎండీయూ వాహనాల ద్వారా ఎంతో సౌకర్యంగా రేషన్ పొందేవారు. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

పమిడి వెంకటేశ్వర్లు, చీమకుర్తి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్

మా పొట్ట కొట్టడం దుర్మార్గం..


ఎండీయూ వాహనాన్ని నడుపుకుంటూ రూ.10 వేలు సంపాదిస్తూ జీవనోపాధి పొందేవాడిని. ఈ ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో పనికోల్పోయాం. ఉద్యోగావకాశాలు కల్పించడం పోయి ఎండీయూ వాహనాలతో ఉపాధి పొందుతున్న మా పొట్ట కొట్టేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దుర్మార్గం.

పొందూరి హరిబాబు, ఎండీయూ ఆపరేటర్, చీమకుర్తి

ఎండీయూ వ్యవస్థను రద్దు చేయవద్దు..


ఎండీయూ వ్యవస్థను రద్దు చేయవద్దు. మరింత మెరుగుపరిచి అవినీతికి తావులేకుండా ఆధునిక సాంకేతికత జోడించాలి. రేషన్ డిపోల వద్ద సరుకులు తీసుకునే ఏర్పాటు ఉండాలి. సన్నబియ్యం సరఫరా చేస్తే అక్రమ రవాణా అరికట్టవచ్చు. ఈ వ్యవస్థ రద్దు వలన వాహనాల డ్రైవర్లకు, హెల్పర్లకు ఉపాధి పోతుంది.

– పూసపాటి వెంకట్రావు, సీపీఎం జిల్లా నాయకుడు, చీమకుర్తి

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం


మద్దిపాడులో యోగా శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు

కొత్తపట్నం: ప్రతి రోజూ క్రమం తప్పకుండా యోగా చేయడం వలన సంతోషంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా పంచాయతీ అధికారి జి.వెంకటనాయుడు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం యోగాపై ఉద్యోగలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో మనిషి ఒత్తిళ్లకు గురవుతున్న క్రమంలో యోగాతో ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం ఉద్యోగులు యోగా శిక్షణ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభం..

మద్దిపాడు: మండల పరిషత్ కార్యాలయ పరిధిలో ఐదు రోజుల యోగా శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో వరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయం నుంచి 10 మంది శిక్షణ తీసుకోవాలని, వారు జూన్ ఒకటో తేదీ నుంచి 21వ తేదీ వరకు గ్రామంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మొదటి రోజు 125 మంది హాజరయ్యారని ఆయన తెలిపారు. బుధవారం నుంచి 200 మందికి తగ్గకుండా ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. యోగా శిక్షకుడు, బసవన్నపాలెం పీఈటీ అంకారావు శిక్షణ ఇచ్చారు. ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.


కొత్తపట్నంలో యోగా చేస్తున్న జిల్లా పంచాయతీ అధికారి వెంకటనాయుడు

వైఎస్సార్ సీపీ నేతకు మాజీ ఎమ్మెల్యే కేపీ పరామర్శ


స్వామిరంగారెడ్డిని పరామర్శిస్తున్న కేపీ నాగార్జునరెడ్డి

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ సీపీ నాయకుడు సూరా స్వామిరంగారెడ్డి అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం గిద్దలూరులోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. మంగళవారం ఆయనను గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు మానం బాలిరెడ్డి, ఓబులరావు, కృష్ణారెడ్డి, పాలుగుళ్ల నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల సమస్య కొలిక్కి..


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్, విద్యుత్‌శాఖ ఏఈలు

బేస్తవారిపేట: మండలంలోని పూసలపాడులో కర్నాటి చిన్న వెంకట సుబ్బారెడ్డి డీప్ బోరుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలను మరో రైతు పీకేశాడు. దీనిపై 'కక్షతో విద్యుత్ స్తంభాలు పెకలింపు' శీర్షికన 'సాక్షి'లో ఈ నెల 26న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దార్ జితేంద్రకుమార్, విద్యుత్ శాఖ ఏఈ సన్యాసిరావు, సర్వేయర్ నాగేశ్వరరెడ్డి సంఘటన జరిగిన పొలం వద్దకు వెళ్లి సంబంధిత రైతులతో మాట్లాడారు. స్తంభాలు పెకలించిన రైతు పొలం కిందవైపు నుంచి మరో స్తంభం అదనంగా ఏర్పాటు చేసేలా ఒప్పించారు. కార్యక్రమంలో వీఆర్వో సయ్యద్ హషం, విద్యుత్ లైన్‌మెన్లు పాల్గొన్నారు.

అంధకారంలో పోలవరం


చీకట్లో ఉన్న ఇళ్లు

- ఇబ్బందుల్లో ప్రజలు

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని పోలవరం అంధకారంలో మగ్గుతోంది. విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు సమాచారం లేకుండా ఇష్టారీతిన విద్యుత్ కోతలు విధిస్తుండటంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. వేసవి కాలం కావడంతో రాత్రి వేళ విద్యుత్ సరఫరా లేకపోవటంతో చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో నీటి కోసం పశువులు, ప్రజలు గొంతు తడుపుకునేందుకు గుక్కెడు నీరు రాక ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళ విద్యుత్ సరఫరా లేకపోవడంతో గ్రామం అంతా గాఢాంధకారంలో మగ్గుతోంది. ఏ వైపు నుంచి ఎవరు కొత్తవారు వచ్చి ఏం చేస్తారో అనే భయాందోళనలు గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. రోజు మొత్తం మీద కనీసం రెండు,మూడు గంటల పాటు కూడా విద్యుత్ సరఫరా జరగటం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు పోలవరం గ్రామానికి రాత్రి వేళ విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ముస్లింలు మహానాడును బహిష్కరించాలి



విలేకరులతో మాట్లాడుతున్న సత్తార్

ఒంగోలు టౌన్: కడపలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడును రాష్ట్రంలోని ముస్లింలు బహిష్కరించాలని సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ అబ్దుల్ సత్తార్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పిఠాపురంలో దళితులను వెలివేయడం, పహెల్గామ్ ఉగ్రవాద దాడి విషయంలో ముస్లింలను ఉగ్రవాదులు ఉప ముఖ్యమంత్రి అభివర్ణించడం, తిరుపతి లడ్డూ విషయంలో అబద్ధాలను ప్రచారం చేయడం తదితర విషయాలలో కూటమి ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న టీడీపీ పాత్రపై అనుమానం వ్యక్తం చేశారు. ఒకవైపు పాకిస్థాన్‌తో యుద్ధం జరుగుతుంటే తానే స్వయంగా రక్షణ మంత్రి అయినట్లు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బాధ్యత లేకుండా మాట్లాడం సిగ్గుచేటన్నారు.

ఏమాత్రం అవకాశం దొరికినా ముస్లింల మీద ద్వేషం వెళ్లగక్కుతుంటే ఆత్మాభిమానం కలిగిన ముస్లింలు మహానాడుకు ఎలా వెళ్తారని ప్రశ్నించారు. చీటికి మాటికీ ముస్లిం గురించి విద్వేష ప్రకటనలు చేసే డిప్యూటీ సీఎం నడిరోడ్డు మీద శృంగారం చేస్తున్న వారి గురించి, దేశ రహస్యాలను శత్రు దేశాలకు విక్రయిస్తున్న వారి గురించి మాత్రం ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. మతోన్మాద విధానాలకు మద్దతుగా నిలుస్తున్న టీడీపీని భవిష్యత్‌లో బీజేపీలో కలిపేస్తారా, లేకపోతే టీడీపీని సనాతన తెలుగు దేశం పార్టీగా పేరు మారుస్తారా అని ఎద్దేవా చేశారు. మహానాడుకు వెళ్లి ప్రాణాలను కోల్పోవడం కంటే రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాల ప్రజలు బహిష్కరించడమే మంచిదన్నారు.

పేరుకుపోయిన చెత్త ప్రాసెసింగ్


అధికారులకు, సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: పేరుకుపోయిన చెత్తని ప్రాసెసింగ్ చేసే కార్యక్రమం గుత్తికొండవారి పాలెం వద్ద ఉన్న డంపింగ్ యార్డులో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాసెస్ విధానాన్ని ఒంగోలు నగర కమిషనర్ కే.వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా ఎంపిక చేసిన తరుణి అసోసియేట్స్ గుత్తికొండ వారిపాలెంలోని డంపింగ్ యార్డ్‌లో పనులు ప్రారంభించారు. ఇక్కడున్న దాదాపు 66 వేల టన్నుల వ్యర్థాలను ప్రాసెస్ చేసే పనిని వేగవంతం చేశారన్నారు. మూడు నెలల్లో పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ యంత్రం ద్వారా ప్లాస్టిక్, మిగిలిన చెత్తను పొడి రూపంలో వేరు చేస్తారన్నారు. ఇలా వేరు చేసిన పొడిని రోడ్ల మీద గుంతలను పూడ్చడానికి ఉపయోగించవచ్చన్నారు. ప్లాస్టిక్ చెత్తను జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీకి తరలిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎంఈ జి.చంద్రయ్య, డీఈఈలు పద్మజ, అనిల్, ఏఈఈలు సౌజన్య, తరుణి అసోసియేట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన కారు, ఐదుగురికి గాయాలు


లారీ వెనుకలో ఇరుక్కుపోయిన కారు

మద్దిపాడు: ముందు వెళ్తున్న లారీని కారు ఢీకొట్టడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈఘటన మంగళవారం తెల్లవారుజామున మండలంలోని దొడ్డవరప్పాడు సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం జిల్లా టేకులపల్లికి చెందిన బోడ సోనీ భర్త మోతిలాల్ కుటుంబానికి చెందిన వారు రెండు కార్లలో మూడు రోజుల క్రితం తిరుపతి వెళ్లి దైవ దర్శనం చేసుకున్నారు. తిరిగు ప్రయాణంలో దొడ్డవరప్పాడు సమీపంలో కారు నడుపుతున్న బోడా బాలు నిద్రమత్తులో ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టడంతో కారు లారీ కింద ఇరుక్కుపోయింది. ఈక్రమంలో వెనక రెండో కారులో ప్రయాణిస్తున్న వారి కుటుంబ సభ్యులు హైవే సిబ్బందికి సమాచారం అందించారు. హైవే అంబులెన్స్ సిబ్బంది కారులో ప్రయాణిస్తూ గాయాలపాలైన బాలు అతని భార్య జ్యోతి, హీరమల్ అతని భార్య బీ అరుణ వారి అత్తయ్య బీ సోనీలను ఒంగోలులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వీరిలో బాలు, హీరమల్, సోనీల తలకు బలమైన గాయాలయ్యాయి. అరుణ, జ్యోతిలకు స్వల్ప గాయాలయ్యాయి. కారులో ఉన్న మరో ఇద్దరు చిన్నారులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి తీసుకున్నారు. మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలభైరవస్వామికి ప్రత్యేక పూజలు


కాలభైరవ స్వామి పూజలో పాల్గొన్న భక్తులు, నిర్వాహకులు


ప్రత్యేక అలంకరణలో నాగలక్ష్మి అమ్మవారు

ఒంగోలుమెట్రో: వైశాఖ అమావాస్య సందర్భంగా కాలభైరవస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం మంగమూరు రోడ్డు లోని గాయత్రి మందిరంలో స్వర్ణాకర్షణ కాలభైరవ సేవా సమితి నిర్వాహకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో దేసు వెంకట సుబ్బారావు, పబ్బిశెట్టి భాను కిరణ్ సభ్యులు పాల్గొన్నారు. లాయర్ పేట షిరిడి సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న రాజరాజేశ్వరి అమ్మవారికి, గద్దలగుంటలోని మహంకాళి మహాలక్ష్మి, మహా సరస్వతి దేవస్థానంలో, బాలాజీరావుపేటలోని పోలేరమ్మ కనకదుర్గమ్మ దేవస్థానం, మంగమూరు రోడ్డు గాయత్రి మందిరం, సంతపేట షిరిడి సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న నాగలక్ష్మి అమ్మవారికి, కేశవస్వామి పేటలో విజయదుర్గ దేవస్థానం, నగరంలోని పలు అమ్మవారి దేవస్థానంలో ఆలయ అర్చకులు అమ్మవారి మూలవిరాట్కు అభిషేకాలు కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రేషన్ షాపుల వద్ద నిత్యావసరాలు అందించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

చీమకుర్తి: వచ్చే నెల నుంచి నిత్యావసరాలను రేషన్ షాపుల వద్దనే అందించాలని తహసీల్దార్ ఆర్.బ్రహ్మయ్య రేషన్ షాపుల డీలర్‌లకు సూచించారు. మంగళవారం చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయలో రేషన్ షాపుల డీలర్‌లకు జూన్ నెల నుంచి పాటించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. జూన్ నెల 1వ తేదీ నుంచి 15 వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ షాపుల వద్దనే నిత్యావసరాలను పంపిణీ చేయాలన్నారు. దివ్యాంగులు, వృద్ధులకు మాత్రం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రేషన్ సరుకులను వారి ఇళ్ల వద్దకు తీసుకెళ్లి ఇవ్వాలని తెలిపారు. ఇప్పటి వరకు ఎండీయూ వాహనాల ద్వారా సరుకులను అందించామని, ప్రభుత్వం ఇక నుంచి ఆయా వాహనాలను వినియోగించవద్దని చెప్పినందున ప్రతిరోజు రేషన్ షాపుల వద్దే ఇచ్చేందుకు డీలర్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ నెల 1వ తేదీన ప్రజాప్రతినిధుల సమక్షంలో వారి ద్వారా నిత్యావసరాలను అందించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్యలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న రేషన్ షాపుల డీలర్‌లు